శృంగార వీధి

# అంతే..

ఆకెళ్ళ సూర్యనారాయణమూర్తి



ఉదయం పది గంటలైంది.

"అబ్బబ్బ! ఎన్నిసార్లు చెప్పినా దండగే. ఒక్క వస్తువు పెట్టిన చోట వుండదు! అవతల ఆఫీసు టైమవుఉతోంది. ఛీ! ఛీ!" అని విసుక్కుంటూ అలమారా అంతా గందరగోళం చేస్తున్నాడు అతను.

"తెల్లారిందంటే చాలు, విసుక్కోవడాలు, రంకెలు వేయడాలు! ఈయనగారితో వేగలేకపోతన్నాను బాబూ! ఏం కొంప మునిగిందని ఆ గావుకేకలు!?" అంటూ వంటింట్లోంచి చరచరా వచ్చింది ఆమె.

"గావుకేకలు పెట్టినా, గొంతు చించుకున్నా ప్రయోజనముండదు కదా! నీకు చెప్పినా, ఆ గోడకు చెప్పినా ఒకటే!"

"అయ్యో, అయ్యో! అనుకుంటూనే వున్నా! నీవ్వంతా నడుం విరిగేటట్టు అలమారా సర్దాను. ఒక్కక్షణంలో నాశనం చేసేశారు!"

"ఆఁ, సర్దావులే మహా! జేబురుమాలు మాత్రం కనబడి చావడం లేదు!"

"జేబురుమాలు కనబడడం లేదని సర్దినవన్నీ చిందరవందర చెయ్యాలా?"

"అవతల టైమవుతోంది. నన్ను విసిగించకు!"

"విసుక్కుంటున్నది మీరు!"

"ప్రతిదానికీ వారించడానికి తయారు!"

"మాట్లాడితే పోట్లాటకి సిద్ధం!"

"నువ్వే!"

"కాదు, మీరే! ఇకనుంచి మీ బట్టలు, మీ వస్తువులు విడిగా పెట్టుకోండి!"

"అదేమిటే నావన్నీ అలా పడేస్తున్నావు?"

"సాయంత్రం వస్తూ మీకో అలమారానో, సూట్‌కేసో తెచ్చుకోండి. అందులో సర్దుకోండి!"

"నిన్నెవరూ సలహాలు అడగలేదు! ఇకనుంచి నా బట్టలు, నా వస్తువులు నాకు సంబంధించిన ఏదీ కూడా నువ్వు ముట్టుకోడానికీ వీల్లేదు!"

మీకు చేతనైతే మాట మీద నిలబడండి!"

"రెచ్చగొడుతున్నావా?"

"కాదు, గుర్తు చేస్తున్నాను. నాకు సగం పని తప్పుతుంది!"

"ఎంత పొగరు! మాటకి మాట చెబుతావా?"

"మీ సహవాసం వూరికే పోతుందా?"

"భలే! ఇది కొంపలా లేదు! ఇంతకన్నా నరకం బెటర్! ఛీ! ఛీ!" అంటూ అతను బయటికి వెళ్ళిపోయాడు, ఆఫీసుకని జేబులో రుమాలు లేకుండానే.

"ఏం మనిషో, ఏమిటో!



వెధవది రుమాలు కనబడలేదని ఇంత రాద్ధాంతం చెయ్యాలా? రోజా ఏదో ఒక గొడవే! మళ్లీ అన్నీ సర్దుకోవాలి, కర్మ కర్మ!" అంటూ పనిలో పడింది ఆమె, ప్రతీరోజూలాగానే. అతను, ఆమె-యజమాని, ఇల్లాలు.

✣ ✣ ✣

పగలంతా ఇలాంటి దృశ్యాలను ఎన్నో చూసిన సూర్యుడు మండిపడుతూనే తన డ్యూటీ పూర్తి చేసి ఇంటికెళ్లిపోయాడు.

✣ ✣ ✣

రాత్రి పదిగంటలైంది.

అతను అసహనంగా ఎదురుచూస్తున్నాడు.

"టైము గడిచిపోతోంది. త్వరగా రావోయ్!"

"వంటిల్లు సర్దడం అయిపోవచ్చింది. వస్తున్నానండి!"

క్షణాల ఆలస్యంకూడా భరించలేనంతగా బెడ్ రూమ్‌లోంచి మాటిమాటికీ వంటింటికేసి తొంగిచూస్తున్నాడు అతను.

నిరీక్షణ ఫలించింది.

అతను తెచ్చిన మల్లెపూలు ఆమె జడలో పరిమళిస్తున్నాయి.

ఆమె వయ్యారాలు అతనిలో సెగలు రేపుతున్నాయి.

ఆమె సింగారాలు అతనిలోని శృంగారభావాన్ని మరింత పెంచుతున్నాయి.

మనసులోని తీపి తీవ్రతను తట్టుకోలేక తమకంగా ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

"సారీ డియర్! పొద్దున్న అనవసరంగా తిట్టాను. నిన్ను బాధ పెట్టాను."

"లేదండి. అసలు తప్పంతా నాదే! ఆఫీసుకి వెళ్లాల్సిన మీకు కావల్సినవి చూడడం నా బాధ్యత!"

"ఆఫీసుకి టైమవుతోందన్న హడావిడిలో విసుక్కున్నాను."

"ఇంట్లో పని తెమలటం లేదని నేనూ అరిచానుగా!"

"పోన్లే. ఏదైనా మాట్లాడు." ఆమెను మరింత దగ్గరగా తీసుకున్నాడు.

"ఏం మాట్లాడమంటారు?" అతని కౌగిట్లో మరింతగా ఒదిగిపోతూ చిన్నగా అడిగిందామె.

"నువ్వు ఏం మాట్లాడినా నాకు యిష్టమే!"

"లేదు. మీరు మాట్లాడండి. నేను వింటాను."

"కిటికీలోంచి వెన్నె ఎంత బాగా పడుతోందో!"

"అవునండి."

"నీ జడలో మల్లెపూల వాసన మత్తెక్కిస్తోంది."

"మీ మాటల్లాగే!"

"ఇలాంటి సుఖం ముందు స్వర్గంకూడా దండగే!"

"అందుకని ఈ రాత్రంతా ఇలా మాట్లాడుతూనే వుంటారా?" నవ్విందామె.

నవ్వుకున్నాడు అతను.

లైటు ఆరిపోయింది ప్రతీరోజూలాగానే.

ఒక చేత్తో కిటికీ తలుపు మూసేశాడు అతను ప్రతీరోజులాగానే, మరో చేత్తో దుప్పటి లాగుతూ.

ఆమె ముఖం చంద్రబింబమైంది.

అతని ముఖంలో వెన్నెలకాంతులు.

దుప్పటిలో వాళ్లిద్దరి మధ్యా దూరం పూర్తిగా తగ్గిపోయింది.

అతను సాయంత్రం ఆఫీసునుంచి వస్తూ కొనుక్కొచ్చిన రుమాళ్లు,

ఆమె అలమారా సర్ది వెతికిపెట్టిన రుమాళ్లు బెడ్‌రూమ్‌లో టేబుల్ మీదే వున్నాయి.

ఆమె, అతను భార్యాభర్తలు.

✣ ✣ ✣

రాత్రంతా ఇలాంటి దృశ్యాలను ఎన్నో చూస్తూనే చంద్రుడు నవ్వుకొంటూనే తన డ్యూటీని పూర్తి చేస్తున్నాడు. ■